క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ఉప్పర కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ గులిగిందల లావణ్య మంగళవారం పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని ఆమె కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం ఆమె ఉప్పర కాలనీ పరసర ప్రాంతాలలో పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హిమలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్ కొండ ప్రాంతంలో కొలువుదీరిన హిమలింగేశ్వరస్వామి ఆలయ 19వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి.గణబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రామ్మోహన్‌నాయుడు, లావణ్య, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు మెడల్స్ అందించిన సీఐ ప్రసాద్

గోపాలపట్నం: క్రీడలతో పిల్లల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందని, చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం అవసరమని ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్ అన్నారు. ఎన్‌ఏడీ శ్రీచైతన్య పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో క్రీడలపై ఆసక్తి ఎక్కువగా ఉంటుందని వాటిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె. మహేష్, జి. శ్రీవాణి, జి.సోనియా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గజ్జాలమ్మతల్లి పండగ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం ప్రాంతంలో కొలువుదీరిన గజ్జాలమ్మతల్లి పండగను మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. రజకుల ఇష్టదైవం అయిన అమ్మవారికి స్థానిక రజక సామాజికవర్గ ప్రజలు పసుపు,కుంకుమలతో అమ్మవారికి అర్చనలు చేశారు. పూజా కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు పి.వి.సురేష్, గులిగిందల లావణ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రజక సామాజిక వర్గ ప్రజలు ఆడారి ఆనంద్‌కుమార్‌కు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ వాసుదేవరావు

గోపాలపట్నం: హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరి చేసుకోవాలని కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం బాజీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఎస్‌ఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ద్విచక్ర వాహనచోదకులకు అవగాహన కల్పించారు. గతేడాది జరిగిన ప్రమాదాల్లో హెల్మెట్ పెట్టుకోకుండా డ్రైవ్ చేయడం కారణంగా 147 మంది మృత్యువాతపడ్డారని వివరించారు. కొందరు బైక్‌కు హెల్మెట్ పెట్టి ప్రయాణించడంపై ఎస్‌ఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సన్యాసిరావు, కానిస్టేబుల్ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పైడిమాంబ.. చల్లగ చూడమ్మా



అమ్మవారిని దర్శించుకున్న పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్



అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు

- ఎండలోనే గంటల కొద్దీ వేచి ఉన్న భక్తులు
- అమ్మవారిని దర్శించుకున్న నాయకులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం పరిసర 14 గ్రామాల ఆరాధ్య దైవం పైడిమాంబ అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. చీరలు గాజులు సమర్పించుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారికి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించారు.

అమ్మవారికి సారె సమర్పణ

త్రివేణి గ్రామాభ్యుదయ సేవా సంఘం సభ్యులు పైడి తల్లి అమ్మవారికి సారె సమర్పించారు. నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలు ఊరేగింపుగా వెళ్లి అందించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు. దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పండగ సందర్భంగా సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బీఆర్‌టీఎస్ సర్వీస్ రహదారిలో పరస జరిగింది. రహదారి సందర్శకులతో కిటకిటలాడింది. వివిధరకాల వస్తువుల విక్రయాలతో ముచ్చగొలిపింది. పోలీసులు ఎక్కడికక్కడ భారీ బందోబస్తు నిర్వహించారు.

సౌకర్యాలు మరిచిన అధికారులు

అమ్మవారి దర్శనాలకు వచ్చిన భక్తుల సౌకర్యాలను దేవదాయ శాఖ అధికారులు గాలికొదిలేశారన్న విమర్శలు వినిపించాయి. ఉచిత దర్శనాల్లో వచ్చిన భక్తులు గంటల కొద్దీ ఎండలో వేచి ఉండాల్సి వచ్చిందని వాపోయారు. కనీసం మధ్యాహ్నం వరకైనా నీడనిచ్చే టెంట్లు వేయాల్సి ఉన్నా పట్టించుకోలేదని భక్తులు వాపోయారు. చిన్న పిల్లలతో పలువురు భక్తులు ఇబ్బందులు పడ్డారు.

అసంపూర్తిగా రక్షణగోడ నిర్మాణం

పూర్తి చేయాలని స్థానికుల డిమాండ్



రక్షణగోడ లేని గెడ్డ



రక్షణగోడ పనులు కొంత వరకే జరిపిన దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు చిన్న ముసలగాడ ప్రాంతంలోని గెడ్డ రక్షణ గోడ నిర్మాణం సగంలో నిలిచిపోయింది. దీంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు,వివిధ ప్రాంతాల్లోని వీధి కాలువల ద్వారా వచ్చే వ్యర్థాలు ఈ గెడ్డ ద్వారా వెళ్తుంటాయి. అయితే భారీ వర్షాలు వచ్చినప్పుడు ఇక్కడ గెడ్డకు రెండు వైపులా గల మట్టి దిబ్బలు కరిగి పోతుండటంతో గెడ్డ కోతకు గురవుతోంది.దీంతో ఐదేళ్ల కిందట గెడ్డకు ఇరువైపులా రక్షణగోడ నిర్మాణం చేపట్టా. అయితే పనులు పూర్తి స్థాయిలో జరపలేదు.దీంతో వర్షాలు వచ్చినప్పుడు రక్షణగోడ లేని చోట మట్టిదిబ్బలు కరగడంతో పాటు నీరు పొంగి రోడ్డుపైకి వస్తుందని స్థానిక వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి మిగిలిన కొంత భాగంలో రక్షణగోడ నిర్మించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్‌లోని సురక్ష డయాగ్నొస్టిక్స్ సమీపంలో రోడ్డు దాటుతున్న వృద్ధుడు బళ్ల సత్యనారాయణను ఎన్‌ఏడీ నుంచి కరాసా వైపు వెళ్తున్న యువకులు అతి వేంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. క్షతగాత్రుడు సత్యనారాయణ మెరీడియన్ టవర్స్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం స్థానికంగా ఉన్న దుకాణం వద్ద పిండి కొనేందుకు వెళ్తున్న సమయంలో కరాసాకు చెందిన యువకులు అతివేంగా వెళ్తూ ఢీకొట్టారు. దీంతో వృద్ధుడు పడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో ట్రాఫిక్ పోలీసులు, ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

ఐక్య పోరాటాలతోనే విజయం



733వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నామంటూ పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసే వరకు కార్మికుల పోరాటం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 733వ రోజు సంస్థకు చెందిన డబ్ల్యూఆర్‌ఎం–1 మరియు 2 విభాగ కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, అయోధ్యరామ్, గుమ్మడి నరేంద్ర, వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ కులమతాలకు అతీతంగా ఐక్యపోరాటాలు జరుగుతున్నాయన్నారు. పోరాటాలను విచ్ఛిన్నం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కుట్రలు పన్నుతోందని, వాటిని ఐక్యంగా తిప్పికొడితేనే విజయం సాధ్యపడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, కార్మికులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.ఎస్.ఎన్.రావు, ఎన్. రామారావు, బొడ్డు పైడిరాజు, మస్తానప్ప, సీహెచ్ సన్యాసిరావు, అప్పారావు, పరంధామయ్య, కార్మికులు పాల్గొన్నారు.

మైనర్ బాలిక ఆత్మహత్య

గోపాలపట్నం: మైనర్ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గోపాలపట్నం ఇందిరానగర్‌లో చోటు చేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు... ఇందిరానగర్‌లో కుటుంబ సభ్యులతో మైనర్‌బాలిక ఉంటుంది. సోమవారం ఉదయం గుడికి వెళ్లి వచ్చిన తర్వాత ఎక్కువ సమయం ఫోన్ మాట్లాడడం గమనించిన తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఇంట్లో ఒక గదిలో తలుపులు వేసుకుని చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఎంతసేపటికీ బాలిక బయటకు రాకపోవడంతో ఇంట్లో వారు కిటికీలోనుంచి చూసే సరికి ఉరి వేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే తలుపులు విరిచి బాలికను కేజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

‘సెల్ఫ్’ విద్యార్థులకు ఎంతో హెల్ప్

- నంగినారపాడు జెడ్పీ హైస్కూల్ సందర్శనలో కలెక్టర్
- ప్రోగ్రాం రూపొందించిన టీచర్లకు కలెక్టర్ అభినందన



సెల్ఫ్ ప్రోగ్రాంను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి వివరిస్తున్న ఉపాధ్యాయులు

సబ్బవరం : విద్యార్థులు తమ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఉపాధ్యాయులు రూపొందించిన ఆన్‌లైన్ ప్రోగ్రాం సెల్ఫ్ ఎవాల్యుయేషన్ అండ్ లెర్నింగ్ ఫర్ ఫ్యూచర్(సెల్ఫ్) ఎంతగానో ఉపయోగపడుతుందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. సెల్ఫ్ ప్రోగ్రాంను రూపొందించిన పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎస్.సోమేశ్వరరావులను అభినందించారు. విద్యార్థులను స్వీయ అభ్యాసం–స్వీయ మూల్యాంకనం వైపు ప్రోత్సహించే విధంగా సెల్ఫ్ ప్రోగ్రాం రూపొందించినట్టు కలెక్టర్‌కు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు తమకు అర్థం కాని అంశాలను, సందేహాలను ఆన్‌లైన్‌లోనే నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఇది ఆన్‌లైన్ సాధనం కావడంతో ఎప్పుడైనా, ఎక్కడైనా ఉపయోగించుకోవచ్చన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పలు అంశాలను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ప్రత్యేక సరళిని రూపొందించడం అభినందనీయమన్నారు. వరుసగా అడిగే ప్రశ్నలకు ముందు జవాబులు చెప్పిన తర్వాతే మిగిలిన ప్రశ్నలు వస్తాయని, ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతే దాని గురించి అర్థమయ్యేలా వివరించే వీడియో వచ్చేలా ప్రోగ్రాం సిద్ధం చేశారని అభినందించారు. వీడియో చూసి ఆ ప్రశ్నకు తగిన జవాబు చెప్పిన తర్వాతే ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. దీని వల్ల విద్యార్థి క్లిష్టమైన అంశాలను నేర్చుకోవచ్చని, మరింత విస్తృతంగా సంబంధిత అంశాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ టూల్ ఉపయోగించడానికి ఎలాంటి సాఫ్ట్‌వేర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి అవసరం లేదన్నారు. పీడీఎఫ్ ఫైల్ ద్వారా వినియోగించుకోవచ్చన్నారు. అదేవిధంగా పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో పర్యవేక్షించేందుకు అనువైన డ్యాష్ బోర్డును కూడా రూపొందించారని తెలిపారు. ఇలాంటి సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసిన ఉపాధ్యాయులను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆరిలోవ: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 60 సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 5న జాతీయ రహదారిపై జూ పార్కు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలుపాలైన ఆయనను ఆరిలోవ పోలీసులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన ఈ నెల 12న రాత్రి మృతి చెందాడు. అప్పటి నుంచి అతని మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఆయన బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు. చికిత్స పొందుతున్న సమయంలో ఆయన పేరు గురుమూర్తి సాహు అని చెప్పినట్టు పోలీసులు తెలిపారు. పూర్తి అడ్రస్ మాత్రం చెప్పలేకపోయాడన్నారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.అనిల్‌కుమార్ తెలిపారు.

తడి–పొడి చెత్త వినియోగంపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న జోనల్ కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురం జూబ్లీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జోన్–5 పబ్లిక్‌హెల్త్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తడి–పొడి చెత్త, ప్రమాదకర ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు తడి–పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని, ప్రమాదకర ప్లాస్టిక్‌ను వినియోగించరాదని తెలిపారు. విద్యార్థులు పాఠశాల పరిసరాలు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పారిశుధ్య పనుల్లో తల్లిదండ్రులకు సహకరించాలన్నారు. తరగతి గదులు, పరిసరాలు, టాయిలెట్లు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆయాలు, ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, పబ్లిక్‌హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీఎస్ఎస్ఎన్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఆలయాల ముస్తాబు



ధర్మానగర్‌లో ముఖద్వారాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం



రంగులు దిద్దుకుంటున్న జ్ఞానాపురం విఘ్నేశ్వర పార్వతీశ్వరాలయం

కంచరపాలెం: ఈ నెల 18న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. కంచరపాలెం పరిధిలో గౌరీ శంకరాలయం, యల్లబిల్లివారి గౌరీ శంకర పంచాయతన ఆలయం, తిక్కవానిపాలెం అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం, ఇందిరానగర్‌లో లక్ష్మీగణపతి ఈశ్వరరాలయం, రామ్మూర్తిపంతులుపేట రామలింగేశ్వరరాలయం, సాంబమూర్తినగర్ కాలనీలో అన్నపూర్ణ ఆలయం, 104 ఏరియా బాపూజీనగర్ శివాలయం, ధర్మానగర్ బీవీఎస్‌టీవీఎస్ కాలనీలో హేరంబ కోదండ ఉమ మహేశ్వరరాలయం ,జ్ఞానాపురం విఘ్నేశ్వర పార్వతీశ్వరాలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శివ పార్వతుల కల్యాణోత్సవం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, అర్చనలు, రజిత బిల్వార్చన, పూర్ణాహుతి, శతరుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఉపవాసం, జాగరణ, కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రంగులతో ఆలయ గోపురాలు కళకళలాడుతున్నాయి. ఆయా ఆలయాలకు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారి ఆలయ 16వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. కాలనీ ప్రజలు వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకుని, పసుపు, కుంకుమ, చీర సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ, అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సేనాపతి తాతబాబు, దండి శ్యామ్, గొంతిన శ్రీను, గవర రాజు, గంటా వర్మ, జెర్రిపోతుల బాబూరావు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శ నాయకుడు దామోదరం సంజీవయ్య



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ మధుసూదనరావు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం దామోదరం సంజీవయ్య 102వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ మధుసూదనరావు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవయ్య అణగారిన వర్గం నుంచి వచ్చినప్పటికీ తన స్వయం కృషితో ఎంతో ఎత్తుకు ఎదిగారన్నారు. తన పట్టుదలతో ఆంధ్రప్రదేశ్ తొలి హరిజన ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా పనిచేసి ఆ పదవులకే వన్నె తెచ్చారని కొనియాడారు. కృషి,పట్టుదల ఉంటే ఒక వ్యక్తి ఏ స్థాయికైనా చేరుకోవచ్చేదానికి ఆయన జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ ఆచార్యులు రాజేంద్రప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ దయానందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

23న బీహెచ్‌ఈఎల్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

గాజువాక: బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఎన్నిక ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి సీహెచ్.ఎస్.త్రినాథరావు ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. అభ్యర్థుల నుంచి ఈ నెల 15న నామినేషన్లను స్వీకరిస్తారు. 16వ తేదీన నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. 17న నామినేషన్ల ఉపసంహరణలు ఉంటాయి. 23న ఎన్నికలు పూర్తయిన అనంతరం అదేరోజు ఫలితాలను ప్రకటిస్తారు.

ఎనిమిది మంది డైరెక్టర్ల ఎన్నిక : ఈ ఎన్నికల్లో 472 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకుంటారు. వారు మొత్తం ఎనిమిది మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. గెలిచిన పాలకవర్గం సొసైటీ అధ్యక్ష కార్యదర్శులను, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటుంది. కోశాధికారిని యాజమాన్యం నియమిస్తుంది. బీహెచ్‌ఈఎల్‌లో ఇప్పటికే కో ఆపరేటివ్ ఎన్నికల సందడి నెలకొంది.

చోరీ కేసు ఛేదన

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–2లో ఇటీవల జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 3న తన ఇంట్లో దొంగతనం జరిగిందంటూ ఉప్పలపాటి అప్పల రాజేశ్వరి(60) ఎంవీపీ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎంవీపీ క్రైమ్ ఎస్‌ఐ సురేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. రాజేశ్వరి వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తున్న ఎదురుపాకల నారాయణప్పడు(35) ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. మంగళవారం వెంకోజీపాలెం కూడలి వద్ద నిందితుడి అదుపులోకి తీసుకుని మొత్తం 9 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు క్రైం డీసీపీ నాగన్న మంగళవారం మీడియాకు తెలిపారు.